సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 21 । జనవరి । 2024



బేగంపేట విమానాశ్రయంలో విన్యాసాలను తిలకిస్తున్న సందర్శకులు

వినువీధిలో వినోదం

మూడోరోజూ మురిపించిన వైమానిక విన్యాసాలు

నేడు మూడుసార్లు..

శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు సార్లు మాత్రమే వైమానిక విన్యాసాలు జరుగుతూ వచ్చాయి. ఆదివారం సెలవు దినం కావడంతో మూడుసార్లు ఏరోబాటిక్స్ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 11–11.45 వరకు, మధ్యాహ్నం 3–3.45 వరకు, సాయంత్రం 5.45 వరకు.. మూడు పర్యాయాలు సందర్శకులు గాలిలో స్టంట్లను తిలకించవచ్చు. ఎంట్రీ పాస్‌లను బుక్ మై షోలో గానీ, నేరుగా విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద గానీ తీసుకునే అవకాశం కల్పించారు.

సనత్‌నగర్: 'వింగ్స్ ఇండియా'కు సాధారణ సందర్శకులు పోటెత్తారు. వైమానిక విన్యాసాలతో సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. 'షో' తిలకించి ఆనంద చకితులయ్యారు. భారీగా తరలివచ్చిన సందర్శకులతో బేగంపేట విమానాశ్రయం కిటకిటలాడింది. విమానాలు, హెలికాప్టర్ల వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించలేదు. రన్‌వే ఎదురుగా ఏర్పాటు చేసిన గ్రిల్స్ వద్దనే సందర్శకులను నిలిపివేశారు. గ్రిల్స్ వద్ద నుంచే విమానాలను తిలకించి మురిసిపోయారు. వాటి ముందు ఫొటోలు తీసుకుని సంబరపడ్డారు. శనివారం ఒక్కరోజే 10 వేల మందికిపైగా సందర్శకులు వచ్చినట్లు సమాచారం.

త్రివర్ణం.. ఆనందభరితం..

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీమ్, మార్క్‌జాప్రీస్ బృందాల వైమానిక విన్యాసాలతో సందర్శకులు సంభ్రమాశ్చర్యానికి లోనయ్యారు. ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలను తిలకించి ఆనంద పారవశ్యులయారు. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా 45 నిమిషాల చొప్పున జరిగిన వైమానిక విన్యాసాలను కనులారా వీక్షించారు. నింగి వైపు త్రివర్ణంలో పొగలు చిమ్ముకుంటూ విభిన్న ఆకృతులను ఆవిష్కరించిన తీరు సందర్శకులను కట్టిపడేసింది. సందర్శకుల కరతాళ ధ్వనులతో విమానాశ్రయ ప్రాంగణం మార్మోగింది. వైమానిక విన్యాసాలు చేసిన పైలట్లతో కలిసి ఫొటోలు దిగేందుకు ఉత్సాహం కనబరిచారు. వింగ్స్ ఇండియా ఏర్పాటు చేసిన స్టాళ్లు శనివారం సందర్శకులతో కిక్కిరిశాయి. విమానయాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి నెలకొంది.

తిను బండారాల ధరలు ఆకాశంలో..

ఏవియేషన్ షోలో తిరిగి తిరిగి.. కూల్‌డ్రింక్స్‌తో సేదదీరుదామనుకుంటే ధరలు చుక్కల్లో కనిపించాయి. చాయ్ తాగాలంటే రూ.40 పెట్టాల్సిందే. ప్లెయిన్ దోశ రూ.150, మసాలా దోశ రూ.180, ఇడ్లీ సాంబార్ రూ.160, పావ్‌బాజీ రూ.180, వెజ్ పిజ్జా రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక జ్యూస్ తాగాలంటే అక్షరాలా రూ.200 వెచ్చించాల్సిందే. ఈ క్రమంలో గత్యంతరం లేక ఇక్కడి ఫుడ్‌కోర్టులను ఆశ్రయించి వారు అడిగినంత ఇచ్చుకుని దప్పిక, ఆకలి తీర్చుకున్నారు.



శివమణి సంగీతం.. శ్రవణానందం

వింగ్స్ ఇండియా–2024 వేదికగా ప్రముఖ పెర్క్యూషనిస్ట్ పద్మశ్రీ శివమణి లైవ్ ప్రదర్శన వీక్షకులకు వీనుల విందు చేసింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అయిన 'కలంకారి' విమానంలో నుంచి వీక్షకుల ముందుకు వస్తూనే తన సంగీతంతో మంత్రముగ్ధులను చేశారు. చేతిలో సూట్‌కేస్ ఆకృతిలో ఉన్న వాద్యాన్ని మనోరంజకంగా ప్లే చేస్తూ అభిమానులకు ఎంట్రీ ఇచ్చారు. ఆఖరికి ఎయిర్ ఇండియా మెట్లను కూడా తన సంగీత సాధనంగా చేసుకుని సందర్శకులకు శ్రవణానందాన్ని పంచారు. అనంతరం 45 పెర్క్యూషన్ వాద్యాలతో దేశ సాంస్కృతిక, సంగీత వైవిధ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఉర్రూతలూగించారు.

విన్యాసాలు అద్భుతం..



వైమానిక విన్యాసాలు బ్బురపరుస్తున్నాయి. ముఖ్యంగా గాలిలో చేసిన స్టంట్లు ఎంతో థ్రిల్ అనిపించాయి. తరచూ చూసే విమానాలే అయినప్పటికీ దగ్గర నుంచి చూడడం ఒక మధురానుభూతి. ఇంటి దగ్గర నుంచి ఫుడ్ తెచ్చుకుందామంటే అనుమతించరని అన్నారు. ఇక్కడ చూస్తే ధరలు ఎక్కువగా ఉండడం బాధాకరం. – ఆకృతి, నగరవాసి

విజ్ఞానాన్ని పంచేలా స్టాళ్లు..



విమానాల దగ్గరకు అనుమతించకపోవడం పిల్లలకు నిరాశను కలిగించింది. వైమానిక విన్యాసాలు మాత్రం సూపర్. ఎంజాయ్ చేశాం. ఎగ్జిబిషన్‌లో ఏవియేషన్ రంగంలో వచ్చిన ఆధునిక మార్పులపై ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. – పూర్ణ, కరీంనగర్

ఒళ్లు గగుర్పొడిచేలా స్టంట్లు



వైమానిక విన్యాసాలు మధురానుభూతిని కలిగించాయి. ఒక్కోసారి పడిపోతుందేమోనని, అంతలోనే ఒక్కసారిగా మళ్లీ గాలిలో దూసుకుపోవడం.. ఒకదానికొకటి ఎదురెదురుగా వచ్చి ఢీకొంటున్నాయా? అన్నట్లుగా విన్యాసాలు సాగాయి. – తరుణ్, నగరవాసి

అక్కడిదాకా అనుమతిస్తే బాగుండేది



విమానాల వద్దకు అనుమతిస్తే బాగుండేది. ఎంతోమంది, ముఖ్యంగా పిల్లలు ఎంతో ఆశగా వాటిలోకి ఎక్కి సరదాగా ఫొటోలు దిగాలనే ఉత్సాహంతో ఏవియేషన్ షోకు వచ్చారు. మొదటి రెండు రోజులు విమానాల్లోకి అనుమతించి సామాన్య ప్రజలకు ఆ అవకాశాన్ని ఇవ్వకపోవడం బాధాకరం. – కృష్ణ, నగరవాసి

ఎన్నో విషయాలు తెలిశాయి..



ఏవియేషన్ రంగంలో వచ్చిన మార్పులు అద్భుతం. డ్రోన్ల పరిజ్ఞానం ఎలా అప్‌డేట్ అయ్యిందో ఇక్కడి స్టాల్స్‌ను చూస్తే అర్థమవుతుంది. ఎన్నో విషయాలను తెలుసుకున్నాం. – కీర్తన, నగరవాసి

న్యూస్‌రీల్

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ శశాంక



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

తుర్కయంజాల్: జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ శశాంక కోరారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఓటు నమోదు, మార్పులు, చేర్పుల గురించి బీఎల్‌ఓలతో మాట్లాడి ఎదురవుతున్న సమస్యలు, నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతంలో ఓటు ఉన్నప్పటికీ, దాన్ని రద్దు చేసుకోకుండా, తిరిగి కొత్త ఓటు నమోదు చేసుకోవద్దని, ఒక వ్యక్తి ఒకటే చోట నమోదై ఉండాలన్నారు. ఎవరైనా ఓటరు మరణించినట్లయితే డెత్ సర్టిఫికెట్ లేదా, స్థానికంగా విచారణ చేపట్టి ఓటును తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, తహసీల్దార్ రవీందర్ దత్తు, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట సీఐగా కాశీవిశ్వనాథ్ బాధ్యతల స్వీకరణ



మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.కాశీవిశ్వనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్ సైబర్ క్రైంకు బదిలీ అయ్యారు. కాశీవిశ్వనాథ్ మంచాల పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై మీర్‌పేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కాశీవిశ్వనాథ్‌కు ఎస్‌ఐలు, సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన పట్నం సీఐ



ఆంజనేయులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నూతన సీఐగా (ఎస్‌హెచ్‌ఓ) ఆంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందరెడ్డి మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సీఐగా బదిలీ అయ్యారు.

రేపు చిలుకూరులో ప్రత్యేక ప్రదక్షిణలు



రంగరాజన్

మొయినాబాద్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక ప్రదక్షిణలు, పాదయాత్ర నిర్వహించనున్నట్లు చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న సోమవారం ఉదయం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక ప్రదక్షిణలు చేపడతామన్నారు. ఆలయం బయటి నుంచి మహా పరిక్రమ (ప్రదక్షిణ), ఆలయం లోపల అంతర్గత పరిక్రమ ప్రత్యేకంగా చేపట్టి సర్వ శక్తిమంతుడికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలపనున్నట్లు ఆయన చెప్పారు. చిలుకూరు గ్రామంలోని హనుమాన్ దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడిచారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.





ఎంపీ వర్సెస్ మాజీ ఎంపీ

- రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి మధ్య మాటల యుద్ధం
- పరస్పర దూషణలు.. పీఎస్‌లో ఫిర్యాదు
- చేవెళ్లలో వేడెక్కిన రాజకీయాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్రమంతా చలిగాలు వీస్తుంటే.. చేవెళ్లలో మాత్రం అప్పుడే రాజకీయ ఉక్కపోత మొదలైంది. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి.. బీజేపీ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇద్దరు నేతలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. సంస్థాగతంగా బలమైన నేతలను తమవైపు తి ప్పుకొనేందుకు తెరవెనుక పావులు కదుపుతున్నారు. ఇతర పార్టీల్లో ఉన్న నేతలను తమ పార్టీలో చేర్పించుకునేందుకు పోటీపడుతున్నారు. ఈ క్రమంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇటీవల స్థానికంగా ఉన్న ఓ సర్పంచ్‌కి ఫోన్ చేశారు. బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలోకి రావాల్సిందిగా అభ్యర్థించారు. విషయం రంజిత్‌రెడ్డికి తెలిసి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఏకంగా విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటా మాటా పెరిగింది. ఎంపీ రంజిత్‌రెడ్డి అసభ్య పదజాలం ఉపయోగించడంపై కొండా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ శనివారం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు నేతలూ ఆర్థిక దిగ్గజాలే కావడం, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగనుండడంతో రాజకీయంగా ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

ఆయనో పెద్ద కబ్జాకోరు

- కోళ్ల దాణా, కోడుగుడ్ల స్కామ్‌లో నిందితుడు
- ఫిలింనగర్‌లో దేవాలయ భూమిని ఆక్రమించాడు
- చేవెళ్లలో వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం
- ఎంపీ రంజిత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రత్నం ఫైర్



విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'రంజిత్‌రెడ్డి ఓ పెద్ద కబ్జాకోరు. ఆయన ఫిలింనగర్‌లోని దేవాలయ భూమిని ఆక్రమించాడు. ఆయనపై కోళ్ల దాణా, గుడ్ల కుంభకోణం ఆరోపణలు ఉన్నాయి. గోపన్‌పల్లి, నానక్‌రాంగూడలోనూ విలువైన స్థలాలను కొల్లగొట్టాడు. కేటీఆర్‌కు ఆయన ఓ బినామీ. ఐదేళ్లలో ఆయన చేవెళ్లకు చేసిందేమీ లేదు' అని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. నగరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ నేతలు రవికుమార్ యాదవ్, తోకల శ్రీనివాసరెడ్డితో కలిసి మాట్లాడారు. ఎంపీగా ఆయన ధ్యాసంతా సంపాదనపైనే ఉందన్నారు. లోక్‌సభలో ఏనాడూ చేవెళ్ల ప్రజల కష్టాలను ప్రస్తావించలేదన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, ఏ ఒక్క రోడ్డునూ వేయించలేక పోయారని విమర్శించారు. సొంత ఫాంహౌస్‌కు ప్రభుత్వ నిధులతో రోడ్డును వేయించుకున్నారని, ప్రస్తుతం ఈ ఫాంహౌస్ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలోని పెద్దలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చు కోకపోతే.. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించాడని, బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ముందు హడావుడిగా రంగారెడ్డి–పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించారని, పనులు పూర్తి కాక ముందే ప్రారంభించి రైతులను మోసం చేశారని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు. 111 జీఓ రద్దు చేసినట్లు ప్రకటించినా.. ఇప్పటికీ కోర్టుల్లో కేసు పెండింగ్‌లోనే ఉందన్నారు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పంపిణీలో స్థానికులకు తీరని అన్యాయం జరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీ చేస్తున్నట్లు ప్రకటించి, ప్రజలను తప్పుదోవ పట్టించాడని ధ్వజమెత్తారు. పరిశ్రమల పేరుతో పెద్ద ఎత్తున పేదల భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం వస్తారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న డీఎఫ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ రితేష్ పటేల్

కేంద్ర పథకాలపై అవగాహన

మహేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎఫ్ఎస్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్స్ సర్వీసెస్) డిప్యూటీ డైరెక్టర్ రితేష్ పటేల్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురంలో గ్రామసభ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూపే కార్డు ద్వారా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా పొందొచ్చన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల జీవిత బీమా, అటల్ బీమా యోజన కింద నెలకు రూ.5000 పెన్షన్ అందిస్తున్నట్టు చెప్పారు. పీఎంఈజీపీ కింద స్వయం ఉపాధి పొందేందుకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రూ.10 లక్షల రుణం, 35 శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు జీఎం డి.రమేష్, రీజినల్ మేనేజర్ యూసఫ్, హైదరాబాద్–1 ఏజీఎం రమణ కుమార్, మహేశ్వరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రమేష్, సర్పంచ్ కాసుల సురేష్, పంచాయతీ కార్యదర్శి రమ్య పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడికి ముత్యాల గజమాల

మల్లాపూర్: నాచారానికి చెందిన వెంకట్ దాస్ అయోధ్య బాలరాముడికి ముత్యాల గజమాలను తయారు చేయించారు. శనివారం నాచారం హెచ్‌ఎంటీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ముత్యాల గజమాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ దాస్ మాట్లాడుతూ.. చినజీయర్ స్వామి ఆదేశాల మేరకు అయోధ్య రామయ్యకు ముత్యాల గజమాలను తయారు చేయించినట్లు తెలిపారు. ఆదివారం అయోధ్యకు వెళ్లి బాలరాముడికి సమర్పిస్తానన్నారు. ఈ సందర్భంగా వెంకట్ దాస్‌ను నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రకాష్ సత్కరించారు.



రామయ్యకు సమర్పించే ముత్యాల గజమాల

నెహ్రూ యువ కేంద్ర సలహా కమిటీ సభ్యుడిగా రూపక్



ఇబ్రహీంపట్నం: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా సలహా కమిటీ సభ్యుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన సూరంపల్లి రూపక్ నియమితులయ్యా రు. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రూపక్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన కేంద్రమంత్రి, బీజేపీ జాతీయ, రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో పలు యువజన కార్యక్రమాలను పట్టణాలు, పల్లెల్లోకి తీసుకెళ్లి యువతను చైతన్యపర్చనున్నట్లు చెప్పారు.



అక్షరాలా అలరించిన జై శ్రీరామ్

అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని శనివారం బోడుప్పల్ హేమానగర్ ఎస్ఆర్‌డీజీ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన 'జై శ్రీరామ్' అక్షరాల ఆకారం విశేషంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. శ్రీరాముని నామస్మరణతో హోరెత్తించారు. జోనల్ ఇన్‌చార్జి సుమలత, పాఠశాల ప్రిన్సిపాల్ వి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

బీజేపీ సిద్ధాంతాలు కాగితాలకే పరిమితం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



అభినందన సభలో ఎమ్మెల్యేలు కూనంనేని, వీర్లపల్లి శంకర్‌ను సన్మానించిన నేతలు

షాద్‌నగర్: బీజేపీ సిద్ధాంతాలు కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయని, ఆ పార్టీ సిద్ధాంతాలను నాయకులు ఆచరణలో పెట్టడం లేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారిని సీపీఐ నాయకులు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీ సిద్ధాంతాలైనా ప్రజల కోసమేనని తెలిపారు. తాము రూపొందించుకున్న సిద్ధాంతాలను ఆ పార్టీలు ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. రామరాజ్యం పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన బీజేపీ శ్రీరాముడి ఆశయాలకు విరుద్ధంగా అధికారం కోసం పాకులాడుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే పార్టీల సిద్ధాంతాలు అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా మాజీ సీఎం కేసీఆర్ ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ఎన్నికల్లో ఓటమిపాలయ్యారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజలు పూర్తిగా విసుగు చెందారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ పేదల పక్షాన నిలబడ్డాయని, అందుకే ఎన్నికల్లో ప్రజలు ఆదరించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో పాలన గాడితప్పినప్పుడు కమ్యూనిస్టులు పాలనను గాడిన పెట్టడానికి సిద్ధంగా ఉంటారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సరికొత్త పాలనను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, రఘు, పాల్మాకుల జంగయ్య, బాబర్‌ఖాన్, పానుగంటి పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

మంచి దిగుబడికి నారుమడే కీలకం

ఉద్యాన శాఖ అధికారి అశోక్


షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో నారు తీస్తున్న కూలీలు

షాబాద్: కూరగాయల నారుమడి సాగులో తగిన మెలకువలు పాటించాలని ఉద్యాన శాఖ టెక్నికల్ అధికారి అశోక్ సూచించారు. లేదంటే ఎదుగుదల లోపించడంతో పాటు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.

- నేలలు మధ్యస్థంగా ఉండాలి
- నారుమడిగా తయారు చేసే భూమిని లోతుగా దున్నాలి.
- నేల బరువు మధ్యస్థంగా ఉండాలి.
- నారుమడి పొడవు 150, వెడల్పు 120 సెం.మీ.లోపు ఉండాలి.
- నులి పురుగులు రాకుండా నేలపై కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లాలి.
- ప్రతీ 10 చదరపు మీటర్లకు 40 నుంచి 50 కిలోల పశువుల ఎరువు వేసి, కలియదున్నాలి.
- నారుకుళ్లు తెగులు సోకకుండా 0.1 శాతం క్యాప్టాన్ లేదా ఫార్మాల్డిహైడ్ 25 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి, నేలను శుద్ధి చేయాలి.
- చెద, గొంగళి పురుగుల నివారణ కోసం విత్తనం చల్లడానికి ముందే క్లోరిపైరిపాస్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి, నారుమడి నేలను తడపాలి.
- రెండు నారుమళ్ల మధ్య, చుట్టూ 8 నుంచి 10 సెం.మీ లోతు, 30 సెం.మీ. వెడల్పుతో కాలువలు తీసి, మురుగు నీరు నిల్వకుండా చూడాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి.

- నారుమడిలోని మొక్కలను రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లేదా ఎండోసల్ఫాన్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కలు బలహీనంగా ఉంటే ఒక శాతం యూరియా ద్రావణం స్ప్రే చేయాలి.
- ఎప్పటికప్పుడు కలుపు తీయాలి.
- నారు తీయడానికి ముందు నీరు పెట్టడం తగ్గించాలి.
- ఉదయం, సాయంత్రం వేళ్లలో మొక్కలు నాటుకోవాలి.

విత్తన శుద్ధి చేయాలి...



నారుమడిలో విత్తనాలు చల్లే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల క్యాప్టాన్ లేదా థైరం కలిపి శుద్ధి చేయాలి. టమాటా విత్తనాన్ని అజోస్పైరిల్లమ్ వంటి బ్యాక్టీరియల్ కల్చర్‌తో కలిపి, వేయాలి. ఎత్తు మడులపై చేతివేళ్లతో లేదా కర్రతో గీతలు గీసుకోవాలి. విత్తనాలను ఇసుకతో కలిపి, వాటిలో పలుచగా చల్లాలి. విత్తనాలు వేసిన వెంటనే వరిగడ్డితో కప్పితే మొలక శాతం పెరగడంతో పాటు త్వరగా మొలకెత్తుతాయి.

– అశోక్, ఉద్యాన శాఖ టెక్నికల్ అధికారి, చేవెళ్ల

బతికుండగానే సంచిలో కుక్కారు!

- పోలీసులకు సవాల్‌గా మారిన ఆదిభట్ల హత్య కేసు
- ఊపిరాడకే మరణించినట్లు ప్రాథమిక నిర్ధారణ
- శరీరంలో లభించని విష ప్రయోగం ఆనవాళ్లు, గాయాలు
- సాంకేతిక ఆధారాలతోనే కేసు దర్యాప్తు
- హతుడిని గుర్తించేందుకు రాష్ట్రంలోని అదృశ్య కేసులన్నీ జల్లెడ
- 12 లక్షల వాహనాలు, లక్షల కొద్దీ కాల్ డేటా విశ్లేషణ

సాక్షి, సిటీబ్యూరో: ఆదిభట్ల ఠాణా పరిధిలో జరిగిన హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హతుడు బతికుండగానే నోటికి ప్లాస్టర్ వేసి, కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి బలవంతంగా గోనె సంచిలో కుక్కారని, గాలి కూడా చొరబడకుండా మూట గట్టిగా కట్టేయడంతో లోపల ఊపిరాడక మరణించి ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 16న బొంగుళూరు టోల్ గేట్ నుంచి 1.5 కి.మీల దూరంలో బ్రాహ్మణపల్లి సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే.

తెలిసిన వాళ్ల పనే..

హత్య అనంతరం మృతదేహాన్ని ఎక్కడ పారేయాలో కూడా దుండగులు ముందుగానే ప్లాన్ చేశారని, ఈ క్రమంలోనే సంక్రాంతి సెలవుల్లో జాతీయ రహదారులలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఎవరూ గుర్తించలేరని నిందితులు భావించి ఉంటారని పోలీసులు పేర్కొన్నారు. హతుడికి తెలిసిన వాళ్లే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సంచిలో మూటకట్టిన మృతదేహాన్ని తీసుకొచ్చి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో పడేసి ఉంటారని వివరించారు. అయితే ఆ ప్రాంతంలో ఎలాంటి వాహన టైర్ల గుర్తులు లభించలేదని, రోడ్డు పైన ఎర్రటి మరకలు ఉండడంతో రక్తం కావచ్చని అనుమానించి..నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని చెప్పారు.

సాంకేతిక ఆధారాలతోనే ముందుకు..

హతుడి ఎవరనేది తేలితేనే కేసు దర్యాప్తు సులువవుతుందని భావించిన పోలీసులు.. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన వందలాది అదృశ్యం కేసుల వివరాలను సేకరించారు. ఘటనాస్థలంలో మృతదేహం పై లభ్యమైన వస్తువులు, హతుడి వయసు, పోలికలతో యువకుల అదృశ్యం కేసుల వివరాలను పోలుస్తున్నారు. ఘటనాస్థలం, పరిసర ప్రాంతాలలో ఎలాంటి సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో పాటు మృతదేహంపై ఎలాంటి కత్తిపోట్లు, గాయాలను పోలీసులు గుర్తించలేదు. శరీరంలో విష ప్రయోగం ఆనవాళ్లు సైతం ఫోరెన్సిక్ పరీక్షలలో వెల్లడికాలేదు. దీంతో కేసు దర్యాప్తు పూర్తిగా సాంకేతిక ఆధారాల పైనే ఆధారపడి ఉందని ఓ పోలీసు అధికారి తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిని బట్టి హత్య ఈనెల 8–10 తేదీలలో జరిగి ఉండొచ్చని, దీంతో ఆయా తేదీలలో ఓఆర్‌ఆర్ మీద ప్రయాణించిన సుమారు 12 లక్షల వాహనాలను, లక్షల కొద్ది ఫోన్ కాల్స్‌ను జల్లెడ పడుతున్నామని తెలిపారు. లక్షల్లో ఉన్న డేటా వందల్లోకి వస్తేనే దర్యాప్తు కొలిక్కి వస్తుందని చెప్పారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బెదిరించిన వ్యక్తి గుర్తింపు

హిమాయత్‌నగర్: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చంపుతామంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్న వ్యక్తిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. గతంలో ఆగంతకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజాసింగ్‌కు విదేశాల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని గుర్తించామని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు. చాంద్రాయణ గుట్టకు చెందిన మమ్మద్ ఖాసిం కువైట్ నుంచి ఈ కాల్స్ చేస్తున్నట్లు పోలీసులు ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించారు. మహమ్మద్ కాసిం 14 ఏళ్లుగా కువైట్‌లో ఉంటున్నట్లు, చాంద్రాయణగుట్ట నుంచి దుబాయ్‌కి వెళ్లి అక్కడి నుంచి కువైట్‌లో సెటిల్ అయినట్లు తెలిసిందన్నారు. ఈ కేసులో నిందితుడు మహ్మద్ ఖాసిం కోసం సైబర్ క్రైమ్ పోలీసులు ఎల్‌ఓసీ జారీచేసినట్లు వెల్లడించారు.

ఎంబీటీ మీటింగ్‌కు పోలీసుల అనుమతి నిరాకరణ

- రెయిన్‌బజార్ వద్ద ఉద్రిక్తత..
- మజ్లిస్, పోలీసుల కుట్ర అని ఎంబీటీ ఆరోపణ

చార్మినార్: ఎంబీటీ పార్టీ ఆధ్వర్యంలో యాకుత్‌పురా బడేబజార్ చౌరస్తాలో శనివారం సాయంత్రం పబ్లిక్ మీటింగ్ ఏర్పాటుకు నిర్ణయించగా..రెయిన్‌బజార్ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నందున అనుమతి నిరాకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంబీటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్‌తో పాటు సౌత్‌వెస్ట్ పోలీసు స్టేషన్లకు చెందిన పలువురు ఇన్‌స్పెక్టర్లు చంచల్‌గూడలోని ఎంబీటీ పార్టీ కార్యాలయానికి చేరుకుని పార్టీ అధ్యక్షుడు పర్వతుల్లాఖాన్‌తో పాటు అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌లకు పరిస్థితిని వివరించారు. ఇందుకు అంగీకరించని పార్టీ కార్యకర్తలు, నాయకులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో సభాస్థలికి వెళ్లే ప్రయత్నం చేసిన పర్వతుల్లాఖాన్‌ను పోలీసులు చంచల్‌గూడ ప్రధాన రోడ్డుపై అడ్డుకున్నారు. కాగా మజ్లిస్ నేతలు, పోలీసులు కలిసి కుట్రపూరితంగానే తమ సభకు అనుమతించలేదని అంజదుల్లాఖాన్ ఈ సందర్భంగా ఆరోపించారు. తాము అనుమతి కోసం ఈ నెల 13న పోలీసులకు రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోగా అనుమతించి..తీరా పబ్లిక్ మీటింగ్ నిర్వహించే రోజైన శనివారం మధ్యాహ్నం అనుమతి లేదంటూ అడ్డుకోవడం సరైంది కాదని ఆయన దుయ్యబట్టారు. ఈ నెల 25 తర్వాత తిరిగి పోలీసుల అనుమతితోనే పబ్లిక్ మీటింగ్ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఊరూరా శ్రీరాముడి సంబరాలు నిర్వహించాలి


వేడుకల్లో పాల్గొన్న భాస్కరయోగి తదితరులు

శంకర్‌పల్లి: శ్రీరాముడు జాతికి ఆదర్శ పురుషుడని. 500 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, 2లక్షల మంది ప్రాణత్యాగాల తర్వాత హిందువుల కల నెరవేరబోతోందని ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ భాస్కరయోగి అన్నారు. మండల పరిధిలోని మహాలింగాపురంలో శనివారం నిర్వహించిన అయోధ్య రాముడి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా రామనామ స్మరణతో మార్మోగుతోందని తెలిపారు. ఊరూరా ఈ సంబరాలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత నాయకులు దామోదర్‌రెడ్డి, నాగభూషణం, నరసింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్‌గూడలో కొత్త సొబగులు


ఎకోపార్కులో సిద్ధమవుతున్న పార్కులు

శంషాబాద్: కొత్వాల్‌గూడలో హెచ్‌ఎండీఏ ఎకో (పర్యావరణ) పార్కు పనులు చకచకా జరుగుతున్నాయి..మొదటి ఫేస్‌లో భాగంగా కొండలు..లోయల్లో నుంచి వంతెనలు..నడిచివెళ్లేందుకు వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాట్లు జరుగుతున్నాయి... ప్రధాన పార్కుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఏవియరీ (పక్షుల) పార్కును అనుసంధానం చేస్తూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. బటర్‌ఫ్లై పార్కు పనులు ఇప్పటికే దాదాపుగా పూర్తయ్యాయి..105 ఎకారల్లో జరుగుతున్న పర్యావరణ పార్కు నగరానికి తలమానికంగా మారనుంది. ఇంకా కాటేజీలు, ఫుడ్ కోర్టులు, అడ్వెంచర్ పార్కులు పూర్తయితే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది.

బైక్‌ను ఢీకొట్టిన డోజర్

యువకుడికి తీవ్ర గాయాలు

మొయినాబాద్: అతివేగం, అజాగ్రత్తతో వచ్చిన డోజర్, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలోని తాజ్ హోటల్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన కంకంటి శ్రీకాంత్ మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న రాణే ఇంజన్ వాల్వ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9.45 గంటల సమయంలో బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా తాజ్ హోటల్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన డోజర్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న శ్రీకాంత్ ఎగిరి కింద పడటంతో కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుణ్ని చికిత్సకోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని గోదుమకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి, గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్‌ఐ శ్రీనివాస్ వివరాల మేరకు.. కుమ్మరిగూడకు చెందిన మైలారం ఈశ్వరయ్య(45) ఈ నెల 18న రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ సమీపంలోని గోదుమకుంట చెరువు గట్టుపై అతని దుస్తులు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చెరువు వద్దకు చేరుకుని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో శుక్రవారం సాయంత్రం వరకు గాలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపేశారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయాన్నే వెళ్లి చూడగా అప్పటికే మృతదేహం పైకి తేలింది. పోస్టుమార్టం నిమిత్తం బాడీని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

6ఈ నెట్‌వర్క్‌లోకి హైదరాబాద్

- ఇండిగో 'మై సిటీ మై హెరిటేజ్' వాక్
- ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బర్స్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన పర్యాటక కేంద్రంగా కలకాలం నిలిచిపోయే ఆర్కిటెక్చర్, సాంస్కృతిక, సాంకేతిక విలువలున్న అద్భుత ప్రదేశం హైదరాబాద్ నగరమని విమానయాన సంస్థ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బర్స్ అన్నారు. ఇండిగో ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరాన్ని 54 దేశీయ, 13 అంతర్జాతీయ గమ్యస్థానాలకు విస్తృతమైన 6ఈ నెట్‌వర్క్‌లో కలుపుతున్నట్లు తెలిపారు. శనివారం నగరం వేదికగా ఇండిగో సీఎస్‌ఆర్ విభాగమైన ఇండిగోరీచ్, ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ దాతృత్వ విభాగమైన ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదవ హెరిటేజ్ వాక్ నిర్వహించాయి. 'మై సిటీ మై హెరిటేజ్' ప్రచారంతో చేపట్టిన ఈ వాక్ ప్రయాగ్‌రాజ్, భువనేశ్వర్, షిల్లాంగ్, నాసిక్‌లలో నిర్వహించామని, ప్రస్తుతం నగరంలోని ప్రతిష్టాత్మక కుతుబ్ షాహీ సమాధుల సముదాయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుతుబ్ షాహీ హెరిటేజ్ పార్క్‌లోని మహమ్మద్ కుతుబ్ షా సమాధి పరిరక్షణకు ఇండిగోరీచ్ మద్దతునిచ్చిందని, ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సహకారంతో తదుపరి దశ పరిరక్షణ పని చేపడుతుందన్నారు. ఇంటర్‌గ్లోబ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ రోహిణి భాటియా మాట్లాడుతూ.., భారత్‌లో వారసత్వ సంపద, సంస్కృతి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు పరిరక్షించడానికి ప్రోత్సహించడంలో భాగంగా మై సిటీ మై హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నామన్నారు. అగాఖాన్ ట్రస్ట్ సీఈఓ రతీష్ నందా నేతృత్వంలోని ఈ వాక్‌లో భాగంగా శతాబ్దాలనాటి అద్భుత వారసత్వ సంపద ప్రశస్తిని, ఖ్యాతిని పరిరక్షించనున్నామని పేర్కొన్నారు. 'మై సిటీ మై హెరిటేజ్' ప్రచారం పది భారతీయ నగరాల్లో విభిన్న వారసత్వం, సాంస్కృతిక అంశాలను అన్వేషించడంతో పాటు డాక్యుమెంట్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రయాగ్‌రాజ్, ఇండోర్, నాసిక్, భువనేశ్వర్, హైదరాబాద్, అహ్మదాబాద్, చండీగఢ్, గోవా, కోల్‌కతా, షిల్లాంగ్‌లలో 200లకు పైగా సాంస్కృతి అంశాలు గుర్తించామని, వాటిని కల్చరల్ మ్యాపింగ్ కథనాలుగా, సెల్ఫ్–గైడెడ్ ట్రైల్స్, లిస్టిల్స్, మ్యూజియం మ్యాపింగ్, కల్చరల్ క్యాలెండర్‌లు, ఫొటోగ్రఫీ తదితర మెటీరియల్‌గా బుక్‌లెట్, డిజిటల్ ఫార్మాట్‌లుగా మార్చామన్నారు.